# సాక్షి
## కుమురం భీం

బుధవారం । 15 । మే । 2024






**పని సరే.. పైసలేవి..!**
విద్యుత్‌శాఖలోని బిల్ కలెక్టర్లకు ప్రత్యేకంగా వేతనాలు లేవు. కమీషన్లు కూడా తగ్గిపోవడంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో▸



**కెరమెరిలో 75.05 శాతం**
ఏజెన్సీ మండలమైన కెరమెరిలో గత పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే ప్రస్తుతం పోలింగ్ శాతం తగ్గింది. నీంగుడలో వందశాతం ఓటింగ్ నమోదైంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
39.5 /27.5

**వాతావరణం**
ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

# గెలుపుపై ధీమా



నాయకులు, కార్యకర్తలతో కలిసి ఓటింగ్‌పై విశ్లేషణ చేస్తున్న బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్



కార్యకర్తలతో పోలింగ్ సరళిపై విశ్లేషణ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ



జోగు రామన్నతో కలిసి కార్యకర్తలతో పోలింగ్‌పై విశ్లేషణ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు

- ఎవరి అంచనాలు వారివే..
- పోలింగ్ సరళిపై పార్టీల్లో మొదలైన విశ్లేషణ
- లక్ష మెజార్టీ సాధిస్తామంటున్న బీజేపీ
- గెలుపు ఖాయమంటున్న కాంగ్రెస్
- ఆ లీడ్ కలిసివస్తుందంటున్న బీఆర్‌ఎస్
- జూన్ 4న తేలిపోనున్న భవితవ్యం

సాక్షి, ఆదిలాబాద్/ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ప్రచారంలో బిజీబిజీగా గడిపిన అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలు సేద తీరారు. బూత్‌ల వారీగా పార్టీకి పోలైన ఓట్ల విషయంలో నియోజకవర్గం వారీగా విశ్లేషణ సాగుతోంది. వాటి ఆధారంగా తమ పార్టీ ఆయా నియోజకవర్గాల్లో లీడ్‌లో ఉందని, మరికొన్ని చోట్ల ప్రత్యర్థి పార్టీతో పోటాపోటీగా ఉందని చెబుతున్నారు. ఈ లెక్కన ఎవరి అంచనాలు వారు వ్యక్తం చేస్తున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఆ రోజు పార్టీల భవితవ్యం తేలిపోనుంది.

**ఎవరి ధీమా వారిదే..**

ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తున్నామని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఆసిఫాబాద్ మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో ఓటర్లు కమలం పార్టీకే పట్టం కట్టారని విశ్లేషిస్తున్నారు. ఆసిఫాబాద్‌లో ప్రత్యర్థి పార్టీలతో పోటీ ఉందని పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ పరిధిలో ఒకే ఒక స్థానం ఖానాపూర్‌లో గెలిచి మొత్తంగా బీఆర్‌ఎస్, బీజేపీల కంటే 2లక్షల ఓట్లు వెనుకబడ్డ తాము ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆ లోటును భర్తీ చేసుకోవడమే కాకుండా అదనంగా ఓట్లు సాధించి గెలుపు వాకిట్లో ఉన్నామని కాంగ్రెస్ ఢంకా బజాయించి చెబుతోంది. ఆసిఫాబాద్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల్లో తమకు లీడ్ వస్తుందని బీఆర్‌ఎస్ అంటోంది. మిగతా నియోజకవర్గాల్లోనూ ఫైట్ ఇచ్చామని పేర్కొంటున్నారు. కొద్దిపాటి మెజార్టీతో తమ గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

**అప్పుడు.. ఇప్పుడు**

2019 పార్లమెంట్ ఎన్నికల్లో 14లక్షల 88వేల 353 ఓట్లకు గాను 10లక్షల 62వేల 895 ఓట్లు పోలయ్యాయి. అప్పుడు 71.41 పోలింగ్ శాతం నమోదైంది. ఈసారి 1లక్ష 61వేల 822 కొత్త ఓటర్లు నమోదయ్యారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో 74.03 శాతం పోలింగ్ నమోదైంది. ఈ లెక్కన కొత్త ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గుచూపారనేది ఆసక్తికరంగా మారింది. అలాగే ఈ ఎన్నికల్లో పురుషులు, మహిళల మొత్తం ఓట్లలో పోలైన ఓట్ల పరంగా శాతంలో కొంత పురుష ఆధిక్యం ఉంది. అయితే సంఖ్యా పరంగా మహిళా ఓటర్లు అధికంగా ఓట్లు వేశారు. ఈ లెక్కన వారి ఆదరణ కూడా ఎవరికి దక్కిందనేది ఈ ఎన్నికల్లో విజయానికి కీలకం కానుంది.

**పార్లమెంట్ నియోజకవర్గ పోలింగ్ వివరాలు**

మొత్తం ఓటర్లు: 16,50,175
పోలైన ఓట్లు: 12,21,563 (74.03 శాతం)
పురుష ఓటర్లు: 8,04,875
పోలైన ఓట్లు: 5,99,108 (74.43 శాతం)
మొత్తం మహిళా ఓటర్లు: 8,45,213
పోలైన ఓట్లు: 6,22,420 (73.64 శాతం)
ఇతరులు: 87
పోలైన ఓట్లు: 35 (40.23 శాతం)

**నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం..**

| | |
|---|---|
| సిర్పూర్: | 71.56 |
| ఆసిఫాబాద్: | 75.49 |
| ఖానాపూర్: | 72.20 |
| ఆదిలాబాద్: | 73.89 |
| బోథ్: | 78.16 |
| నిర్మల్: | 71.68 |
| ముధోల్: | 75.63 |

**ఇదీ పరిస్థితి..**

- అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో గెలుపొందింది. ఈ ఎన్నికల పరంగా ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పరిశీలిస్తే పార్లమెంట్ సెగ్మెంట్‌లో ముధోల్ రెండో స్థానంలో, ఆదిలాబాద్ నాలుగో స్థానం, నిర్మల్ ఆరో స్థానం, సిర్పూర్ ఏడో స్థానంలో నిలిచాయి. ఈ పోలింగ్ సరళి బీజేపీకి ఎలా ఉపయోగపడిందో అనేది ఫలితాల రోజే స్పష్టం అవుతుంది.
- శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆసిఫాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో గెలుపొందింది. ఈ నియోజకవర్గాల్లో ఈ పార్లమెంట్ ఎన్నికల పరంగా పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తే.. ఈ మొత్తం సెగ్మెంట్‌లోనే బోథ్ అధిక పోలింగ్ శాతంతో మొదటి స్థానంలో నిలుస్తుంది. ఆసిఫాబాద్ మూడో స్థానంలో నిలిచింది. ఈ లెక్కన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు బీఆర్‌ఎస్‌కు తోడ్పడినట్టే ఈ ఎన్నికల్లో ఆదరించారో.. లేదో అనేది ఫలితాల రోజే తేలనుంది.
- అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పరంగా సెగ్మెంట్‌లో ఐదో స్థానంలో నిలిచింది. ఇది హస్తం పార్టీకి ఎంత మేరకు ఉపయుక్తంగా ఉంటుందో తేలాల్సి ఉంది.

## ముందుగానే పాఠ్యపుస్తకాలు



ఆసిఫాబాద్ పట్టణంలోని గోదాంలో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలు

- విడతలవారీగా జిల్లాకు సరఫరా
- ఇప్పటికే గోదాంకు చేరిన 1,57,760 పుస్తకాలు
- సకాలంలో విద్యార్థులకు అందించేందుకు విద్యాశాఖ కసరత్తు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏటా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తోంది. 2024– 25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పుస్తకాలను పాఠశాలల పునఃప్రారంభం సమయంలోనే అందించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విడతల వారీగా జిల్లాలకు అవసరమైన పుస్తకాలు పంపిణీ చేస్తోంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు మొదటివిడతగా వచ్చిన పుస్తకాలను జిల్లా కేంద్రంలోని గోదాంలో భద్రపరిచారు.

**అలస్యమైతే ఒత్తిడి**

కొన్నేళ్లుగా సకాలంలో పాఠ్యపుస్తకాలు రాకపోవడం, వచ్చినవి కూడా విద్యార్థులకు సరిపోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరోనా సమయంలో కూడా పుస్తకాలు అందించడంలో తీవ్ర జాప్యం జరిగింది. పుస్తకాలు సకాలంలో అందకపోతే చిన్నారులతోపాటు సిలబస్ పూర్తి చేయాలనే ఒత్తిడి టీచర్లపైనా ఉంటుంది. పాఠశాలల పునఃప్రారంభం రోజే అన్ని తరగతుల టెక్స్ట్‌బుక్స్ అందిస్తే ఉపయోగం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో 2024– 25 విద్యా సంవత్సరానికి సంబంధించి పుస్తకాల పంపిణీ ప్రక్రియను మే నెలలోనే ప్రారంభించారు. జూన్‌లో బడులు తెరుకునే నాటిని పూర్తిస్థాయిలో అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాకు చేరుకున్న పుస్తకాలను ఆసిఫాబాద్ పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లోని గోదాంలో భద్రపరుస్తున్నారు. మరోవైపు విద్యార్థులకు స్కూల్ యూనిఫాం కుట్టు బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించిన విషయం తెలిసిందే. యూనిఫాంలను సైతం విద్యార్థులకు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**4.78 లక్షల పుస్తకాలు అవసరం**

జిల్లా ప్రభుత్వం అన్ని యాజమాన్యాల కింద పని చేస్తున్న పాఠశాలలు మొత్తం 1076 ఉన్నాయి. ఇందులో పదో తరగతి వరకు దాదాపు 64,141 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు ప్రకటించగా.. జూన్ 13న బడులు పునఃప్రారంభమవుతాయి. విద్యా సంవత్సరం ప్రారంభమైతే కొత్త అడ్మిషన్లతో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాకు మొత్తం 4,78,076 పాఠ్యపుస్తకాలు అవసరమవుతాయని జిల్లా విద్యాశాఖ అధికారులు నివేదికలు సమర్పించారు. ప్రస్తుతానికి మొదటి విడతగా 1,57,760 పుస్తకాలు, 70 వేల నోట్‌బుక్స్ జిల్లాకు చేరుకున్నాయి. 50 శాతానికి పైగా పుస్తకాలు జిల్లాకు చేరుకున్న తర్వాత డీఈవో ఆదేశాలతో ఎమ్మార్సీ కార్యాలయాలకు తరలిస్తారు. అక్కడి నుంచి మండలాల్లో పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లాల్సి ఉంటుంది. కాగా.. ప్రతీ పాఠ్యపుస్తకంలో పార్ట్ 1, 2 అని రెండు భాగాలుగా ముద్రిస్తున్నారు. ఓ వైపు ఇంగ్లిష్, మరోవైపు తెలుగు మీడియంలో పాఠ్యాంశాలు ఉండేలా పుస్తకాలు ముద్రించారు.

**గోదాంలో భద్రపరుస్తున్నాం**



జిల్లాకు 1,57,760 పుస్తకాలతోపాటు 70వేల నోట్‌బుక్స్ చేరుకున్నాయి. వీటిని జిల్లా కేంద్రంలోని గోదాంలో భద్రపరుస్తున్నాం. ప్రస్తుతానికి పార్ట్– 1 పుస్తకాలు రాగా.. పార్ట్– 2కు సంబంధించినవి సెప్టెంబర్‌లో వస్తాయి. గోదాం నుంచి మండలాలకు, అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తాం. విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందితే వారిపై ఎలాంటి ఒత్తిడి ఉండదు. విద్యార్థులకు బడుల పునఃప్రారంభం రోజు పుస్తకాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పుస్తకాలు పక్కదారి పట్టకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం.
– రాథోడ్ ప్రకాశ్, పాఠ్యపుస్తకాల మేనేజర్ ఆసిఫాబాద్

## న్యూస్‌రీల్

**కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలు**

ఆసిఫాబాద్‌రూరల్: కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 7.0 జీపీఏకు పైన సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన దివ్యాంగులు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ నెల 30 లోగా https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌తోపాటు ఎంసెట్ కోచింగ్ ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**‘ఉపాధ్యాయులపై లాఠీచార్జి సరికాదు’**

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయులపై లాఠీచార్జి సరికాదని, నిబంధనల ప్రకారం అలవెన్సులు చెల్లించాలన్నందుకు పోలీసుల ద్వారా బలప్రయోగం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు నారాయణఖేడ్ జిల్లాలో ఉపాధ్యాయులపై ఆర్డీవో లాఠీచార్జి చేయించారని ఆరోపించారు. సదరు ఆర్డీవోపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన వారిపై దాడి చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

**‘ఆదిలాబాద్‌లో బీజేపీదే విజయం’**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో కీలకమన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఓటు వేసిన ప్రతీ ఒక్కరికి ఆయన అభినందనలు తెలిపారు. బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించిన పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి డబుల్ డిజిట్ ఎంపీ సీట్లు వస్తాయని, ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలు కోసం పోరాటం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు కొంగ సత్యనారాయణ, వెంకటేశ్, వీరభద్రచారి తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా శంబాజీ మహరాజ్ జయంతి**



వేడుకల్లో ఆరె సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శివాజీ భవనంలో మంగళవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంబాజీ మహరాజ్ జయంతి వేడుకలు ఆరె సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శంబాజీ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ శివాజీ తర్వాత ఆయన వారసుడిగా శంబాజీ మరాఠా సామ్రాజ్యాన్ని సుభిక్షంగా పాలించారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాదారాం, జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కాజీ, నాయకులు మారుతి, దిలీప్, ప్రశాంత్, గెడేకర్ సంతోష్, మనోహర్, పోశన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**జైనూర్‌లో 144 సెక్షన్**

జైనూర్(ఆసిఫాబాద్): జైనూర్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో పోలీసులు మంగళవారం మండల కేంద్రంలో 144 సెక్షన్ అమలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వ్యాపారులు సైతం సంపూర్ణ బంద్ పాటించి శాంతి భద్రతలకు సహకరించారు. డీఎస్పీ సదయ్య, సీఐ అంజయ్య, ఎస్సైలు మధుకర్, సందీప్‌కుమార్ తదితరులు శాంతిభద్రతలను పర్యవేక్షించారు.


# ధాన్యం తూకంలో మోసం!



ఒడ్డుగూడలో ఆందోళన చేస్తున్న రైతులు

- ఒడ్డుగూడ కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన

దహెగాం(సిర్పూర్): ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే తూకంలో మోసం చేస్తున్నారని రైతులు ఆందోళనకు దిగారు. దహెగాం మండలం ఒడ్డుగూడ గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి ఒడ్డుగూడకు చెందిన రైతులకు సంబంధించి సుమారు 500 బస్తాలను తూకం వేశారు. ఇందులో రైతు సత్తన్నకు అనుమానం రావడంతో మంగళవారం పక్కనే ఉన్న ప్రైవేట్ వ్యాపారి కంటా వద్దకు తీసుకెళ్లి ఓ బస్తాను తూకం వేశాడు. బస్తా బరువు 42 కిలోలకు పైగా ఉండటంతో నివ్వెరపోయాడు. నిబంధనల ప్రకారం 40.5 కిలోలు మాత్రమే తూకం వేయాల్సి ఉండగా, 42 కిలోలకు పైగా తూకం వేస్తున్నారని మిగితా రైతులకు వివరించాడు. దీంతో వారంతా వచ్చి కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. తూకంలో మోసం చేస్తున్న విషయాన్ని కలెక్టర్ ఫిర్యాదు చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై డీసీఎస్‌వో వినోద్‌కుమార్‌ను సంప్రదించగా.. ‘తూకంలో మోసం జరగడం ఉండదు. కాంటాలో టెక్నికల్ సమస్యతోనే ఇలా జరిగింది. కాంటాను మార్చాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి తుమ్మిడె నారాయణకు సూచించాం. బస్తాకు 40.5 కిలోలు మాత్రమే తూకం వేయాలని ఆదేశించాం..’ అని పేర్కొన్నారు.



42 కిలోలు చూపుతున్న కాంటా

# ఆదిలాబాద్ ఎంపీ స్థానం బీఆర్‌ఎస్‌దే

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ ఎంపీ స్థానం బీఆర్‌ఎస్‌దేనని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆత్రం సక్కు భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. ఆత్రం సక్కు గెలుపు కోసం ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులు మండుటెండలను సైతం లెక్కచేయకుండా పని చేశారన్నారు. గులాబీ జెండా ఎత్తుకుని పార్టీ విజయానికి కృషి చేసిన వారిని మర్చిపోమన్నారు. సమావేశంలో నాయకులు అలీబిన్ అహ్మద్, రవీందర్, సలాం, భీమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# నర్సరీలకు ‘ఎండదెబ్బ’

- అధిక ఉష్ణోగ్రతలతో మొక్కలకు ముప్పు
- ఎండలకు వడలిపోతున్న వైనం
- సంరక్షణకు పంచాయతీ సిబ్బంది అవసోపాలు

రెబ్బెన(ఆసిఫాబాద్): జూలైలో చేపట్టే హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. రెండు నెలల క్రితం నర్సరీల్లో మొక్కల పెంపకం ప్రారంభించారు. అయితే కొన్ని రోజులుగా ఎండలు దంచికొడుతున్న విషయం తెలిసిందే. జిల్లాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలు, తీవ్రమైన వడగాలులు మొక్కల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఎండల వేడి నుంచి మొక్కలను సంరక్షించేందుకు పంచాయతీ సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. దాదాపు అన్ని నర్సరీల్లో షేడ్ నెట్లు ఏర్పాటు చేశారు. రోజుకు రెండు పూటలు నీళ్లు పడుతున్నా వడగాలులతో బెడ్లు గంటలోనే తడారిపోతున్నాయి. షేడ్ నెట్స్ ఉన్నా మొక్కలను పూర్తిస్థాయిలో కాపాడలేకపోతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో కొన్ని మొక్కలు వడలిపోతుండగా.. మరికొన్ని చిన్న మొక్కలు వేడికి చనిపోతున్నాయి. గత వారం రోజులుగా వాతావరణం కాస్త చల్లబడినా ప్రయోజనం ఉండటం లేదు.

**సిబ్బంది అవసోపాలు**

హరితహారం కార్యక్రమంలో నాటేందుకు జిల్లాలోని 334 గ్రామ పంచాయతీల్లో ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేశారు. గతంతో పోల్చితే ఈసారి మొక్కల పెంపకాన్ని రెండు నెలల ముందే చేపట్టారు. అన్ని నర్సరీల్లో మొక్కలు ప్రస్తుతం ఏపుగా ఉన్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బెడ్లలో మొక్కలు పెంచుతూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నీళ్లు పడుతున్నారు. ఎండల వేడి నుంచి రక్షణ ఉండేందుకు గ్రీన్ షేడ్‌నెట్స్ ఏర్పాటు చేశారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతుండగా వడగాల్పులు సెగలు కుక్కుతున్నాయి. వీటి ప్రభావం నర్సరీల్లోని మొక్కలపై పడుతోంది. వేడి తట్టుకోలేక మొక్కలు వడలిపోతున్నాయి. దీంతో సిబ్బంది సంరక్షణకు అపసోపాలు పడుతున్నారు. చనిపోయిన వాటి స్థానంలో కొత్త వాటిని నాటేందుకు ప్రైమరీ బెడ్స్‌లో సిద్ధంగా పెంచుతున్న చిన్నమొక్కలు ఎండల వేడిని తట్టుకోలేక పోతున్నాయి.



రెబ్బెన నర్సరీలోని మొక్కలకు సాయంత్రం పూట నీళ్లు పడుతున్న ఉపాధిహామీ కూలీ

**పెరుగుతున్న పనిభారం**

నర్సరీల్లో మొక్కల పెంపకం ద్వారా ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పని కల్పిస్తున్నారు. ఎండల తీవ్రతతో ఎక్కువ సార్లు మొక్కలకు నీటిని అందించాల్సి వస్తోంది. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల కారణంగా నీళ్లు అందించిన కొద్ది గంటల్లోనే బెడ్లు తడారిపోతున్నాయి. అయితే చాలా నర్సరీల్లో అందుబాటులో నీటి సౌకర్యం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పడుతున్నారు. ట్యాంకర్లతో తీసుకువచ్చిన నీళ్లు సైతం వేడెక్కుతున్నాయి. వాటిని మొక్కలకు అందించకుండా ప్రతిసారి ట్యాంకర్లను నింపుతున్నారు. ఎక్కువ సార్లు నీళ్లు అందించడం, మాటిమాటికీ ట్యాంకర్లను నింపాల్సి వస్తుండటంతో పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలపై పనిభారం పడుతోంది.

**లక్ష్యం 55లక్షల మొక్కలు**

జిల్లాలో హరితహారం కార్యక్రమం ద్వారా ఈ ఏడాది 55లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా నర్సరీల ఆధ్వర్యంలో మొక్కలు పెంచుతున్నారు. డీఆర్‌డీఏ ద్వారా 35 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యం పెట్టుకున్నారు. వాస్తవ లక్ష్యానికి అదనంగా మరో 15 శాతం పెంచుతున్నారు. నర్సరీల్లో ప్రస్తుతం 43.60 లక్షల మొక్కలు సిద్ధం చేస్తున్నారు. మిగిలిన వాటిని అటవీ, సింగరేణి ఆధ్వర్యంలో సిద్ధం చేస్తున్నారు. అన్ని చర్యలు తీసుకుంటున్నా మొక్కలు చనిపోతుండటంతో సిబ్బందికి పనిభారం పెరుగుతుండగా.. జూలై నాటికి అవసరమైన మొక్కలు అందించడం కూడా సవాల్‌గా మారుతోంది.

**రోజుకు మూడుసార్లు నీళ్లు**

హరితహారం కార్యక్రమం కోసం పెంచుతున్న మొక్కలు ఎండల వేడికి చనిపోకుండా రోజుకు మూడు పూటలు నీళ్లు పడుతున్నాం. అలాగే ప్రతి నర్సరీలో ఎండల నుంచి మొక్కలకు రక్షణ ఉండేలా గ్రీన్ షేడ్ నెట్స్ ఏర్పాటు చేశాం. ప్రతీ పంచాయతీ తప్పనిసరిగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి పెంచుతున్నాం. నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం.
– సురేందర్, డీఆర్‌డీవో

# ‘బాధ్యులను కఠినంగా శిక్షించాలి’

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్‌లో జరిగిన దాడి ఘటనలో బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాడిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు వెళ్తే అడ్డుకోవడం సరికాదన్నారు. దాదాపు 500 మంది ఒడ్డెరగూడ కాలనీకి వెళ్లి దాడి చేశారని, అందులో ఆదివాసీ యువకుడిపై కూడా దాడికి దిగారని ఆరోపించారు. దాడులకు పాల్పడిన వారికి శిక్షించని పక్షంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## క్లుప్తంగా

### టీచర్ సదానందం హఠాన్మరణం


సదానందం (ఫైల్)

మంచిర్యాల అర్బన్: ఎన్నికల విధులు ముగించుకుని వచ్చిన మరుసటి రోజు ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) టీచర్ గడిగొప్పుల సదానందం గుండె నొప్పితో హఠాన్మరణం చెందడం తీవ్ర విషాదం నింపింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గోపాల్‌వాడకు చెందిన సదానందం రామకృష్ణాపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా కాసిపేట్ మండలం మల్కపల్లిలో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ఎన్నికల విధులు కేటాయించారు. సోమవారం ఎన్నికలు ముగియగానే ఇంటికి తిరిగివచ్చారు. గుండెలో నొప్పితో పాటు నీరసంగా ఉండడంతో మంగళవారం ఉదయం మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ నొప్పి ఎక్కువగా రావడంతో మెరుగైన వైద్యంకోసం మరో ఆస్పత్రికి తరలించగా పరీక్షలు నిర్వహిస్తుండగానే మృతి చెందారు.

### ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

బెజ్జూర్: ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలంలోని కృష్ణపెల్లి గ్రామానికి చెందిన ఆటో మంగళవారం మహారాష్ట్ర నుంచి ప్రయాణికులతో బెజ్జూర్‌కు వస్తుండగా కోయపల్లి–నాగెపెల్లి గ్రామాల మధ్య అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ఎలుకపెల్లి గ్రామానికి చెందిన గోలేటి జానాబాయికి తీవ్రంగా సోనా బాల, హరీష్‌బాలకు స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

### దొంగ ఓట్లు వేశారని ఫిర్యాదు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ మాజీ సర్పంచ్ సునీత–లింబాజీ దంపతులు రెండు చోట్ల ఓట్లు వేశారని మంగళవారం గ్రామస్తులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మేడంపల్లి పోలింగ్ కేంద్రంతో పాటు సుర్జాపూర్ పోలింగ్ కేంద్రంలో వేర్వేరుగా దొంగ ఓట్లు వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సంబంధిత సెక్టోరల్ అధికారికి సైతం పోలింగ్ ముగియకముందే ఫిర్యాదు చేశామన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించిన సర్పంచ్ దంపతులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్, మేడంపల్లి మాజీ సర్పంచ్ గుగ్లావత్ రాజేందర్‌నాయక్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆకుల వెంకాగౌడ్, మాజీ ఉపసర్పంచ్‌లు జంగిలి శంకర్, మంగ్లారపు సత్యనారాయణ, నాయకులు సంతోష్, మల్లేశ్, దేవోజీ, రవి, లక్ష్మణ్, శివ్‌లాల్, ప్రశాంత్, రంజిత్, సురేందర్, విలాస్, వినేశ్, గణేశ్, నరేశ్ పాల్గొన్నారు.



# కుటుంబ సభ్యులతో సరదాగా..

పార్లమెంట్ ఎన్నికల మహాక్రతువు ముగిసింది. ప్రచారంలో భాగంగా రెండునెలలపాటు నేతలు తీరిక లేకుండా గడిపారు. సోమవారం పోలింగ్ ముగియడంతో మంగళవారం సేదదీరుతూ కనిపించారు. రోజంతా ఇంట్లోనే ఉండి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. నాయకులు, కార్యకర్తలతో పోలింగ్‌సరళిపై సమీక్షించారు.

–ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలటౌన్/ఉట్నూర్‌రూరల్/భైంసాటౌన్/నేరడిగొండ/కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్:


ఉట్నూర్‌రూరల్: ఇంట్లో రొట్టె చేస్తున్న ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ


ఉట్నూర్‌రూరల్: కుమారులతో చెస్ ఆడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


నేరడిగొండ: కుటుంబ సభ్యులతో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


కుటుంబ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


ఆదిలాబాద్‌టౌన్: కార్యకర్తలతో ముచ్చటిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్


భైంసాటౌన్: తమ నివాసంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్


మంచిర్యాలటౌన్: ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు


మంచిర్యాలలోని నివాసంలో బీజేపీ నాయకులతో 'గోమాస' సమీక్ష


మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ నాయకులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు


కాగజ్‌నగర్‌లోని నివాసంలో కార్యకర్తలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

# ఇందారం ఓసీ పనులు అడ్డగింత

జైపూర్: ఇందారం ఓపెన్‌కాస్టులో స్థానిక భూనిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ యువకులు ఆందోళనబాట పట్టారు. మంగళవారం ఉదయం షిఫ్టులో లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తూ భూనిర్వాసితులకు మొండిచేయి చూపిస్తున్నారన్నారు. ఓపెన్ కాస్టులో భూములు కోల్పోవడమే కాకుండా దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతుంటే ఉపాధి అవకాశాలు మాత్రం ఇతర ప్రాంతాల వారికి కల్పించడం సరికాదన్నారు. స్పందించిన పీవో శ్రీనివాస్ యువకులతో మాట్లాడి విడతల వారీగా స్థానికులకే అవకాశాలు కల్పిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.


యువకులు అడ్డుకోవడంతో నిలిచిన లారీలు

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలోని కన్నాల శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు. గ్రామానికి చెందిన మంద లచ్చయ్య భీడు భూమిలో ఓ వ్యక్తి పడి ఉండడాన్ని గమనించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తాళ్లగురిజాల పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై నరేష్, ఏఎస్సై రాజన్న ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మూడురోజుల క్రితం మరణించినట్లు గుర్తించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, వివరాలు తెలిసిన వారు తాళ్లగురిజాల పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఎస్సై 8712656563, సీఐ 87212656561 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.


గుర్తు తెలియని మృతదేహం

# క్రాస్ ఓటింగ్‌పై సర్వత్రా చర్చ

- గెలుపుపై ఆశలు పెట్టుకున్న నదరు పార్టీ శ్రేణుల్లో కలవరం
- అభ్యర్థికి ముచ్చెమటలు పట్టిస్తున్నట్లు చర్చ




బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి క్రాస్ ఓటింగ్ జరిగిందనే ప్రచారం సాగుతోంది. బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓ జాతీయ రాజకీయ పార్టీ ఓట్లు అనూహ్యంగా మరో జాతీయ రాజకీయపార్టీకి మళ్లాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈక్రమంలో గెలుపుపై ఆశలు పెంచుకున్న సదరు పార్టీ శ్రేణుల్లో కలవర పాటు మొదలైంది. కేంద్రంలో అధికారంలోకి రావడానికి ఓ జాతీయ రాజకీయ పార్టీ తీవ్ర స్థాయిలో ప్రచారం సాగించగా అధికారంలో ఉన్న మరో జాతీయ పార్టీ మళ్లీ గెలవాలనే తలంపుతో పోటా పోటీగా ప్రచారం చేసింది. పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్థిక, అంగబలం కలిగి ఉన్న అభ్యర్థిని నిలబెట్టి అతని గెలుపు కోసం సర్వ శక్తులు వొడ్డినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు తమతో సరితూగరనే ధీమా వ్యక్తం చేసి జోరుగా ప్రచారం నిర్వహించింది. ఓటర్లు తమవైపే ఉన్నారని, తమ అభ్యర్థి విజయం ‹నల్లేరు మీద నడక› అన్నచందంగా వ్యవహరించారు. అయితే సోమవారం పోలింగ్ ముగిసిన తర్వాత కానీ ఓటరు నాడి బయటపడలేదని చెబుతున్నారు. ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన తీరుకు భిన్నంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేశారనే ప్రచారం అసెంబ్లీ నియోజకవర్గంలో కోడై కూస్తోంది. ఈతీరే అర్థబలం, అంగబలం ఉన్న అభ్యర్థికి ముచ్చెమటలు పట్టిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

**ఓటర్ల తీరు మారిందా?**

అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితికి ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లలో ఎంతో మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో తలపడిన ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులు ఈసారి ఓటర్లను ప్రభావితం చేయలేకపోయాయి. కేవలం ప్రచారంపైనే దృష్టిసారించి ఓటర్లను ఆకర్శించే యత్నాలకు తెర దించినట్లు తెలుస్తోంది. దీంతో ఓటర్ల మనోగతంలో ఒక్కసారిగా మార్పు వచ్చినట్లుగా చెబుతున్నారు. అర్థబలం కలిగిన ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థిపై ఆశలు పెంచుకుని తీవ్ర నిరాశకు గురైనట్లుగా రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈకారణంగానే ఓటర్లు అనివార్యంగా మరో జాతీయ పార్టీ అభ్యర్థికి స్వచ్ఛందంగా ఓటు వేయాలని భావించినట్లుగా రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓ జాతీయ పార్టీని ఆదరించినట్లుగానే కేంద్రంలోనూ మరో పార్టీని గెలిపించాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా మరికొందరు అభిప్రాయ పడుతున్నారు.

**క్రాస్ ఓటింగ్‌కు సై అన్నారా?**

పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ప్రధాన రాజకీయ పార్టీల మధ్యనే పోటీ కనిపించింది. ఆ మూడు పార్టీల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవి చూసిన రాజకీయ పార్టీ గట్టిపోటీని ఇస్తుందని ప్రత్యర్థులు భావించారు. ఆ రెండు జాతీయ రాజకీయపార్టీలకు ఏమాత్రం తగ్గకుండా ప్రచార పర్వం హోరెత్తించారు. అయితే పోలింగ్ రోజున సదరు పార్టీ శ్రేణుల ఆలోచనల్లో మార్పు కనిపించినట్లుగా తెలుస్తోంది. సరైన పోటీని ఇవ్వలేక పోతున్నట్లు గ్రహించిన శ్రేణులు ఆఖరు దశలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడగొట్టిన పార్టీపై కక్ష తీర్చుకునేందుకు ప్రత్యర్థి అయిన మరో జాతీయ పార్టీకి ఓట్లు వేయాలని గుట్టుగా ప్రచారం చేసినట్లు చర్చించుకుంటున్నారు. తాము గెలువక పోయినా ఫర్వాలేదు కానీ అర్థబలం కలిగిన అభ్యర్థిని ఓడించాలనే పట్టుదలతో క్రాస్ ఓటింగ్ చేయించినట్లు ప్రచారంలో ఉంది. అదే కనుక నిజమైతే అసెంబ్లీ ఎన్నికల్లో 3 వేల వరకు ఓట్లు సాధించిన సదరు జాతీయ పార్టీ ఈసారి గణనీయమైన ఓట్లు రాబట్టుకుంటుందని చర్చ జరుగుతోంది. గెలిచినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనే కొందరు అంటున్నా గట్టి పోటీ మాత్రం తప్పదని విశ్లేషిస్తున్నారు. మరోవైపు సొంత పార్టీ శ్రేణులు సైతం క్రాస్ ఓటింగ్ చేయించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# నిర్వహణలోపం.. అలంకార ప్రాయం


రంగు వెలిసిపోయి కళావిహీనంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం

- టీటీడీ కల్యాణ మండపాన్ని పట్టించుకునే వారు కరువు
- సౌకర్యాల లేమితో అద్దెకు తీసుకోని ప్రజలు
- వృథాగా ఉండడంతో ఆదాయం కోల్పోతున్న వైనం

బెల్లంపల్లి: ధార్మిక , ఆధ్యాత్మిక, శుభకార్యాల నిర్వహణ కోసం బెల్లంపల్లి కేంద్రంగా నిర్మించిన తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ ) కల్యాణ మండపం అలంకార ప్రాయంగా మారింది. సరైన వసతులు, నిర్వహణ లేక వృథాగా ఉంటోంది. అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో లక్షల రూపాయలతో నిర్మించిన మండపం మరింత అధ్వానంగా మారుతోంది.

**శ్రీకోదండ రామాలయం ప్రక్కన....**

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి శ్రీకోదండ రామాలయం పక్కన టీటీడీ ఆధ్వర్యంలో కళ్యాణ మండపం నిర్మించారు. దశాబ్దకాలం క్రితం రూపుదిద్దుకున్న ఈ మండపంలో నాలుగైదు ఏళ్ల వరకు కార్యక్రమాలు జరిగాయి. అద్దెకు తీసుకుని పుర ప్రజలు శుభకార్యాలు జరిపించారు. ముఖ్యంగా వివాహాలు నిర్వహించారు. శ్రీకోదండ రామాలయానికి పోటీగా ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్ల కన్నా అతి తక్కువ ధరకు కళ్యాణ మండపాన్ని అద్దెకు ఇవ్వడంతో పోటీపడి శుభ కార్యాలయాలు జరిపించారు. ఆ తర్వాత కార్యక్రమాల నిర్వహణ తగ్గుముఖం పట్టాయి. నిర్వహణను కూడా పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రస్తుతం ఏ కార్యాలూ జరుగడం లేదు. దీంతో నిరుపయోగంగా మారింది.

**ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్ల వైపే మొగ్గు ....**

శాఖాహారులకు టీటీడీ కళ్యాణ మండపం ఎంతగానో ఉపయోగపడింది. మున్సిపాలిటీ పరిధిలో వాసవీ కన్యకాపరమేశ్వరి, టీటీడీ కళ్యాణ మండపాలు శాఖహార వంటకాలకు వినియోగించడం జరుగుతుంది. ఇతర ఫంక్షన్ హాళ్లలో మాంసాహార వంటకాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో అనేక మంది అద్దె అధికమైనా ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లనే ఎంచుకుంటున్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో ఆధునిక సౌకర్యాలు ఆకర్షిస్తున్నాయి. సౌకర్యాలను బట్టి వేల రూపాయల అద్దె వసూలు వసూలు చేస్తున్నారు. టీటీడీ కళ్యాణ మండపం అద్దె కేవలం రూ.2 వేల వరకు ఉండటంతో శాఖ హార ప్రియులు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతున్నా.. నిర్వహణ సరిగా లేక ముందుకు రావడం లేదు. కొన్ని నెలల పాటు శ్రీకోదండ రామాలయ కమిటీకి టీటీడీ కళ్యాణ మండపం నిర్వాహణ బాధ్యతలను అప్పగించగా అద్దె చెల్లించే పరిస్థితులు కూడా లేకపోవడంతో నాలుగు నెలల క్రితం టీటీడీకి అప్పగించారు.

**అసౌకర్యాలకు నిలయంగా..**

కళ్యాణ మండపంలో సరైన సౌకర్యాలు లేవు. ముఖ్యంగా శుభ్రత లోపించింది. దీనిని నిర్మించినప్పుడు వేసిన రంగులు మినహా కొత్తగా వేయలేదు. దీంతో అవి వెలిసిపోయి భవనం పేలవంగా కనిపిస్తోంది. ఇక మండపాన్ని నిత్యం పర్యవేక్షించే అధికారులు కరువయ్యారు. అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో వాచ్‌మెన్, స్వీపర్ సరిగా విధులు నిర్వహించడం లేదు. దీంతో చెత్త చెదారం కళ్యాణ మండపంలో పేరుకుపోతోంది. దీంతో కళ్యాణ మండపాన్ని అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. విశాలమైన గదులు, ఇతర సౌకర్యాలు ఉన్నా కూడా శుభకార్యాల నిర్వహణకు వెనుకాడుతున్నారు.

**పర్యవేక్షణ చేయాలి**



టీటీడీ కల్యాణ మండపాన్ని అద్దెకు ఇవ్వడానికి సంబంధిత అధికారులు తప్పని సరిగా అందుబాటులో ఉండి పర్యవేక్షణ చేయాలి. మండపంలో కార్యక్రమాల నిర్వహణకు తగిన వసతులు కలిపించాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలుతీసుకోవాలి. మండపానికి రంగులు వేయించి ప్రజలు వినియోగించుకునేలా చూడాలి.

– పొట్ల సురేశ్, మాజీ కౌన్సిలర్, బెల్లంపల్లి

**ఇబ్బందులు లేకుండా..**



కల్యాణ మండపంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, వివాహాది శుభకార్యాలు నిర్వహించడానికి అనువుగా తీర్చిదిద్దాలి. అద్దెకు తీసుకున్నవారు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలి. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పించాలి. నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు.

– ఇప్ప రవి, సామాజిక కార్యకర్త, బెల్లంపల్లి

### ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

కుభీర్: ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని భోకర్ తాలూకా బేంద్రే గ్రామానికి చెందిన జాదవ్ వినోద్ (18) రెండేళ్లుగా కుభీర్ మండలంలోని చాతా గ్రామానికి చెందిన దేవేందర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ట్రాక్టర్‌తో హల్దా వైపు వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

### ముగ్గురి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి ఖిల్లాలో సోమవారం జరిగిన దాడికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. తిర్పెల్లి ఖిల్లాకు చెందిన గొర్ల రాము, గొర్ల రాకేష్ తమపై దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సిరికొండ మండల కేంద్రానికి చెందిన లింగన్న–రుకుంబాయి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. 2011లో గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఒక కుమారుడు వాగులో మునిగి చనిపోయాడు. మరో కుమారుడు కోలాపురి నవీన్ (27) జిల్లా కేంద్రంలోని ఓ ఆర్థోపెడిక్ వైద్యుడి వద్ద పనిచేస్తున్నాడు. కైలాస్‌నగర్‌లోని గెజిటెడ్ ఉద్యోగుల సంఘ భవనంలో మరో మిత్రుడితో కలిసి అక్కడే ఉంటున్నాడు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు తన స్నేహితుడితో కలిసి స్వగ్రామం సిరికొండకు వెళ్లాడు. ఓటు వేసిన అనంతరం స్నేహితుడు అక్కడే ఉండిపోగా నవీన్ జిల్లా కేంద్రానికి తిరిగి వచ్చాడు. మంగళవారం ఉదయం మరో స్నేహితుడు గెజిటెడ్ సంఘ భవనానికి టిఫిన్ చేసేందుకు వెళ్లి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండడంతో పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చేతికొచ్చిన ఇద్దరు కుమారులు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తోడుగా ఉంటారనుకున్న కుమారులు కానరాని లోకాలకు వెళ్లడంతో వారు రోదించిన తీరు అందర్నీ కలచివేసింది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు

సారంగపూర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కంకెట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాణిక్యం, లక్ష్మణచాంద మండలంలో విధులు నిర్వహిస్తున్న మరో ఉపాధ్యాయుడు ముత్యం సోమవారం ఉట్నూర్‌లో జరిగిన ఎన్నికల విధుల్లో పాల్గొని అర్ధరాత్రి కారులో నిర్మల్ బయలుదేరారు. మహబూబా ఘాట్స్ వద్దకు రాగానే కారుకు అడ్డువచ్చిన అడవిపందులను తప్పించే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న బండరాళ్లను ఢీకొట్టారు. దీంతో కారు బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి.